క్లుప్తంగా

అక్రమ అరెస్టులు దారుణం


సురేష్‌కుమార్

హుకుంపేట: వైఎస్సార్ సీపీ నేతలను అక్రమ అరెస్టు చేయడం దారుణమని, కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని పార్టీ నాయకుడు తెడబారికి సురేష్‌కుమార్ చెప్పారు.ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఏడాది పైబడినా ఒక్క పథకం అమలుచేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తోందన్నారు. ప్రజల పక్షాన పోరాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం సరికాదన్నారు. సంక్షేమ పథకాలు అమలుచేయకుండా చంద్రబాబు చేస్తున్న మోసాలు ప్రజలు గమనిస్తున్నారని, త్వరలో గుణపాఠం చెబుతారన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమాచార హక్కు చట్టంపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. రాజనీతి శాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో డాక్టరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఉత్తర్వుల మేరకు శనివారం సమాచార హక్కు చట్టం 20 సంవత్సరాల వేడుకలో భాగంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ పర్యవేక్షణలో క్విజ్ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ పోటీలో 49 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు చెప్పారు. విజేతలకు ఆగస్టు 15న బహుమతులు అందజేయనున్నట్టు చెప్పారు. ఎన్ఎస్ఎస్ పీవోలు నాగబాబు, వై.విజయలక్ష్మీ, ఎం.అనిత కుమారి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కొండబాబు, అధ్యాపకులు గణేష్, ఎస్.అప్పారావు, బి.లచ్చన్న, ఎస్.సోంబాబు, రాజు, సురేష్, అంబికా, భవాని, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి


కొత్నాపల్లిలో కార్యకర్తలతో మాట్లాడుతున్న నాయకుడు అనిల్ తదితరులు

హుకుంపేట: మండలంలోని కొత్నాపల్లి పంచాయతీ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి అనిల్, స్థానిక నాయకులతో కలిసి శనివారం పర్యటించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అరాచక పాలన, అమలుచేయని పథకాలతో ప్రజలకు చేస్తున్న మోసాలను వివరించారు. అనంతరం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యకర్తలు, నాయకులతో పంచాయతీ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. సర్పంచ్‌లు కాకరి బొంజుబాబు, రేగం రమేష్, మాజీ జెడ్పీటీసీ కొర్ర కాసులమ్మ, మండల పార్టీ ఉపాధ్యక్షుడు వెంకటరావు, నాయకులు సూరిబాబు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి


మద్దిగరువులో డస్ట్‌బిన్లు పంపిణీ చేస్తున్న యూనిట్ ఇన్‌చార్జి రమేష్

జి.మాడుగుల: మండలంలో బొయితిలి పంచాయతీ మద్దిగరువు గ్రామంలో తడి–పొడి చెత్త వేరు చేసేందుకు డస్ట్‌బిన్లను స్థానిక మహిళలకు బొయితిలి పంచాయతీ చెందిన యూనిట్ ఇన్‌చార్జి కిడారి రమేష్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవన శైలికి అందరు కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు. ఆశ కార్యకర్త పుష్పవతి, వార్డు సభ్యురాలు లలిత, అంగన్‌వాడీ టీచర్ నారాయణమ్మ, మహిళలు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరికి ఊంజల్ సేవ

అనకాపల్లి: స్థానిక మెయిన్ రోడ్డులోని కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శ్రావణ మాసం సందర్భంగా ఊంజల సేవ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు దంపతులచే ఆలయ అర్చకులు నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పల శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఊంజల సేవ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చినట్టు నిర్వాహకులు తెలిపారు.

బిక్కు బిక్కు మంటూ..

- పరాయిపంచన విద్యాశాఖ కార్యాలయం
- ఇరుకైన గదులు
- శిథిలావస్థలో భవనం
- వనత సమస్యతో సతమతం
- నూతన భవనం కోసం విన్నపం

ముంచంగిపుట్టు: మండల విద్యాశాఖ కార్యాలయానికి సొంత భవనం కరువైయింది. విద్యాశాఖ మండలంలో ఏర్పడిన నేటి వరకు పరాయి పంచన నిర్వహణ జరుగుతుంది. ప్రస్తుతం ఎంపీడీవో కార్యాలయంలో ఒక గదిలో భవనం విద్యాశాఖ కార్యాలయం నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ భవనం సైతం శిథిలావస్థకు చేరుకుంది. భవనం పైకప్పు రేకులు పాడై, గోడలు బీటలు వారి దర్శనం ఇస్తున్నాయి. విద్యాశాఖ అధికారులు, సిబ్బంది భయపడుతూ విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. కార్యాలయంలో రికార్డులు భద్రపరించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మండల విద్యాశాఖాధికారి, ఏడుగురు సీఆర్‌పీలు, సిబ్బంది ఇరుకు గదిలోనే సర్దుకుపోతూ విధులు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ఆన్‌లైన్ పనులు చేసే సమయంలో సీఆర్‌పీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. వివిధ పనుల నిమిత్తం ఉపాధ్యాయులు కార్యాలయానికి వచ్చే సమయాల్లో సైతం అవస్థలు తప్పడం లేదు. అనేకసార్లు విద్యాశాఖ కార్యాలయానికి సొంత భవనం నిర్మించాలని, నిధులు మంజూరు చేయాలని ముంచంగిపుట్టులో పని చేసిన విద్యాశాఖ అధికారులు విద్యాశాఖ ఉన్నతాధికారులకు విన్నవించిన స్పందన కరవైంది.

పుస్తకాల నిల్వకు ఇబ్బందులే

ముంచంగిపుట్టు మండలంలో 23 పంచాయతీలకు చెందిన 204 పాఠశాలలు ఉన్నాయి.401 మంది ఉపాధ్యాయలు విధులు నిర్వహిస్తున్నారు.10,197 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసే పుస్తకాలు, యూనిఫారం, బూట్ల వంటి వస్తువులు నిల్వ చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిషత్‌కు చెందిన మూడు భవనాలు విద్యాశాఖ కార్యాలయం నిర్వహణ, విద్యార్థులకు అందించే వస్తువులు, సరకులు నిల్వకు గతంలో కేటాయించారు. ఆయా భవనాలు శిథిలదశకు చేరుకున్నాయి. సుమారు 10 నుంచి 20 ఏళ్లుగా ఆయా భవనాల్లోనే కార్యాలయం నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు పంపిణీ చేసే పుస్తకాలు, యూనీఫారం వంటివి కాపాడుకుంటూ వచ్చారు. ప్రసుత్తం ఆయా భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎంపీడీవో కార్యాలయం సమీపంలో పుస్తకాలు నిల్వ ఉంచే గదిపై ఇటీవల కురిసిన వర్షానికి చెట్టు పడిపోవడం భవనంపై కప్పు పాడైపోయింది.విద్యాశాఖ అధికారులు పైకప్పు రేకులు వేసిన భవనం కారిపోతుంది.పాఠశాలలకు పంపిణీ చేసే మెటిరియల్స్‌ను భద్రపరిచేందుకు నానా అవస్థలు పడుతున్నారు. విద్యకు కీలకమైన విద్యాశాఖ కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తక్షణమే ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి మండల కేంద్రంలో విద్యాశాఖ కార్యాలయానికి సోంత భవనం కోసం స్థలం కేటాయించి, నిధులు మంజూరు చేసి భవనం నిర్మించాలని మండల వాసులు కోరుతున్నారు.


ముంచంగిపుట్టులో ఇరుకైన గదిలో విధులు నిర్వహిస్తున్న విద్యాశాఖ సిబ్బంది



శిథిలావస్థలో ఎంఈవో కార్యాలయం భవనం, (ఇన్‌సెట్) చెట్టు పడి దెబ్బతిన్న భవనం

భవనం నిర్మించాలి

విద్యాశాఖ భవనం శిథిలావస్థకు చేరుకుంది. భవనం పైకప్పు పాడైంది.గోడలు బీటలు వారాయి.భవనం నాచు పట్టి దారుణంగా ఉంది. వర్షం పడితే గదిలో నీరు చేరుతుంది. విలువైన రికార్డులు, పాఠశాలలకు సరఫరా చేసే పుస్తకాలు, యూనిఫారం తదితర సామగ్రి తడిసిపోతున్నాయి. వాటిని సంరక్షించేందుకు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. గోడల నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. భవనం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి ఉన్నాయి. ఇరుకైన గదిలో విధులు సిబ్బంది నిర్వహిస్తున్నారు. ఎంఈవో కార్యాలయానికి కొత్త భవనం నిర్మించాలి.

– రాము, ముంచంగిపుట్టు

శిథిల భవనంలోనే విధులు



విద్యాశాఖ కార్యాలయం ప్రసుత్తం ఎంపీడీవో కార్యాలయంలో ఒక గదిలో నిర్వహిస్తున్నాం. ఈ భవనం శిథిలావస్థలో ఉంది. భవనం పైకప్పు పాడైపోయింది.వర్షకాలంలో కారిపోతూ ఉండడంతో విధులు నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇరుకు గదిలోనే సర్దుకుంటూ విధులు నిర్వహిస్తున్నాం. మండల వ్యాప్తంగా 204 ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేసే పుస్తకాలు, బూట్లు, యూనీఫారంలు సైతం నిల్వ ఉంచేందుకు సరైన గదులు లేవు.మండల పరిషత్‌కు చెందిన శిథిల భవనాలలోనే పుస్తకాలు నిల్వ ఉంచాల్సి వస్తుంది. విద్యాశాఖకు సొంత భవనం నిర్మిస్తేనే సమస్యలు తీరుతాయి.

– కోదా కృష్ణమూర్తి, ఎంఈవో, ముంచంగిపుట్టు

ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న సర్పంచ్ పిట్టా రామారావు, పీసా కమిటీ మండల అధ్యక్షుడు జయరాజు

వి.ఆర్.పురం: పోలవరం ముంపు మండలాలను రంపచోడవరం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలని చిన్నమట్టపల్లి సర్పంచ్ పిట్టా రామారావు పీసా కమిటీ మండల అధ్యక్షుడు కోటం జయరాజు అన్నారు.చింతరేవుపల్లిలో శనివారం జరిగిన సమవేశంలో వారు మాట్లాడుతూ ముంపు మండలాలకు పరిపాలన సౌలభ్యం జరిగేందుకు రంపచోడవరాన్ని జిల్లా చేయాలన్నారు. పాడేరు జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు అనేక ఇబ్బందులు ఉన్నాయన్నారు. పాడేరు వెళ్లే వచ్చేందుకు రెండు రోజులు పడుతుంన్నారు. కూటమి ప్రభుత్వం రంపచోడవరాన్ని జిల్లా కేంద్రం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ముత్యాల మురళి, గూటాల ముత్యాలరావు, నవీన్ కుమార్, రామారావు, సత్యనారాయణ, కరుణాకర్, దుర్గాప్రసాద్, లక్ష్మణరావు, విజయ్ కుమార్, శేఖర్ రాముడు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

శిథిల పాఠశాలల్లో గిరిజన విద్యార్థుల అవస్థలు


వట్టివేగిసలోని పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న సర్పంచ్ హనుమంతరావు

జి.మాడుగుల: మండలంలోని సొలభం పంచాయతీలో గల వట్టివేగిస, గొందిపాడు, వనభరంగిపాడు గ్రామాల్లో పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి ఉందని సర్పంచ్ ఐసరం హనుమంతరావు చెప్పారు. మండలంలో సొలభం పంచాయతీలో వట్టివేగిస, గొందిపాడు గ్రామాల్లో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఆయన శనివారం సందర్శించారు. వట్టివేగిస గ్రామంలో పాఠశాల పనితీరు, మధ్యాహ్న భోజనం నిర్వహణ, విద్యాభ్యాసం తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పాఠశాలలో 21 మంది విద్యార్థులు చదువుతున్నారని, పాఠశాల భవనం తలుపులు, కిటికీలు, ఫ్లోరింగ్‌లు, గోడలు పాడై, వర్షం వస్తే కారిపోతున్నాయని, పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని ఉండడం వలన ఇబ్బందులు, సమస్యలు ఎదుర్కొంటున్నారని విద్యార్థులు, తల్లిదండ్రులు సర్పంచ్ హనుమంతరావు దృష్టికి తీసుకొచ్చారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల భవనాలు కూలిపోయే స్థితిలో ఉన్నాయన్నారు. పాఠశాల భవనాలు స్థితిగతులు, నిర్వహణ పట్ల ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం తగదని భవనాలు కూలిపోతే గిరిజన విద్యార్థుల పరిస్థితి ఏమటని? ఆయన ప్రశ్నించారు. గొందిపాడు గ్రామంలో గల పాఠశాల వర్షానికి గదులు చెరువులను తలపిస్తున్నాయని, కూర్చోవడానికి ఇబ్బందులకు సమస్యగా ఉండడంతో సచివాలయంలో పాఠశాలను నిర్వహించుకోవల్సిన పరిస్థితి ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వనభరంగిపాడు గ్రామంలో పాఠశాల కూడా శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించాలని, ఇందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

పోలీసు ఎన్‌కౌంటర్‌పై మెజిస్టీరియల్ విచారణ రేపు


తహసీల్దార్ వేణుగోపాల్

వై.రామవరం: మండలంలోని యార్లగడ్డ పంచాయతీ , శేషరాయి గ్రామ సమీపంలోని దుమ్ముకొండ ప్రాంతంలో మే నెల 8న జరిగిన పోలీసు ఎన్‌కౌంటర్‌పై రంపచోడవరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 28 మధ్యాహ్నం 2 గంటలకు మెజిస్టీరియల్ విచారణ జరగనున్నట్టు తహసీల్దార్ పి.వేణుగోపాల్ చెప్పారు. ఆయన విలేకరులతో పోలీసు ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు నేతలు కాకూరి పండన్న ఎలియాస్ జగన్ ఎలియాస్ బిరుసు, మరో నేత వాగ పొడియామి అలియాస్ రమేష్ అలియాస్ నాగన్న మృతి చెందారని ఆయన పేర్కొన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌పై పబ్లిక్‌గాని, మేధావులుగాని ఎవరైనా అభ్యంతరాలు, ఏదైనా సమాచారం తెలియజేయాలనుకుంటే ఈ విచారణ కార్యక్రమానికి హాజరుకావాలని తహసీల్దార్ వేణుగోపాల్ కోరారు.

రహదారులు జలమయం


రాజవొమ్మంగిలో కురుస్తున్న వర్షం


దుంబ్రిగుడలో కురుస్తున్న వర్షం

దుంబ్రిగుడ: ఏజెన్సీలో విస్తారంగా వర్షలు కురుస్తున్నాయి. మండలంలోని గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. రహదారులు జలమయమయ్యాయి. మండల కేంద్రంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వర్షపునీరు, మురుగునీరు రహదారులను ముంచెత్తింది.

రాజవొమ్మంగి: జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసాయి. రాజవొమ్మంగి మండలంలో 8.8 ఎంఎం వర్షం కురిసినట్టు జిల్లా గణాంకాధికారి మురళీకృష్ణ శనివారం తెలిపారు. మండలంలో వరి అధికంగా వర్షాధారంగానే సాగవుతోంది. ఇప్పటికే వరి నారుమడులు సిద్ధం కాగా నాట్లు వేసేందుకు అనుకూలమైన వాతావరణం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

స్మార్ట్ మీటర్లను ఇళ్లకు అమర్చకుండా అడ్డుకోవాలి

ఆర్.వై.అగ్రహారంలో సీపీఎం పిలుపు


ఆర్.వై.అగ్రహారంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కరపత్రాలను అందిస్తున్న సీపీఎం నాయకులు

కె.కోటపాడు : అదానీ స్మార్ట్ మీటర్లను ఇళ్లకు ఏర్పాటు చేయకుండా ప్రజలంతా వ్యతిరేకించాలని సీపీఎం నాయకుడు ఈర్లె నాయుడుబాబు తెలిపారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు వ్యతిరేకంగా శనివారం ఆర్.వై.అగ్రహారంలో ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయుడుబాబు మాట్లాడుతూ పాత మీటర్లను కొనసాగించాలని ఆయన కోరారు. కరెంట్ చార్జీలు తగ్గిస్తామని ఎన్నికల ప్రచారంలో చెప్పిన రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం ఏడాది పాలనలోనే రూ.15,485 కోట్లు భారం ప్రజలపై ఛార్జీల రూపంలో మోపిందని అన్నారు. బడా బాబుల జేబులు నింపేందుకు స్మార్ట్ మీటర్లు, విద్యుత్ ఛార్జీలను పెంచుతున్నట్టు తెలిపారు. ప్రజలకు నష్టం కలిగించే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు యాళ్ల శ్రీను, యడ్ల రామారావు, మల్లునాయుడు, శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన


మాట్లాడుతున్న ఏఎస్ఐ లక్ష్మణరావు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై విద్యార్థులకు ఏఎస్ఐ కె.లక్ష్మణరావు శనివారం అవగాహన కల్పించారు. విద్యార్థినులు, మహిళలపై జరుగుతున్న నేరాలు వాటి నుంచి రక్షించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నేటి సామాజిక పరిస్థితుల్లో మహిళలకు ఆత్మ రక్షణ అనేది పదునైనా ఆయుధమన్నారు. మహిళల చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళల రక్షణ కోసం పోలీసుశాఖ నిరంతరం పని చేస్తుందన్నారు. ప్రస్తుతం సైబర్ నేరాలు పెరుగుతున్నాయని వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళా పోలీసు, విద్యార్థినులు పాల్గొన్నార.

కళాశాలలో సమస్యలు పరిష్కరించాలి


సమస్యలు పరిష్కరించాలని నిరసన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కార్తీక్ శ్రీను అన్నారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కొర్రా కర్తీక్‌శ్రీను మాట్లాడుతూ కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలని, బాలుర వసతి గృహంలో మరుగుదొడ్లు మరమ్మతులు చేయాలని, డైనింగ్ హాల్ నిర్మించాలని, అసంపూర్తిగా ఉన్న భవనాలు, అదనపు భవనాలు వేగంగా పూర్తి చేయాలని కోరారు. బాలికల వసతి గృహంలో నైట్ వాచ్‌మెన్, సెక్యూరిటీ గార్డులను నియమించాలని, మంచాలు,ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఎన్నిక

ముంచంగిపుట్టు మండల ఎస్ఎఫ్ఐ నూతన కమిటీను ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి కొర్రా త్రినాథ్, అధ్యక్షుడు కార్తీక్ శ్రీను పర్యవేక్షణలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ మండల కమిటీ అధ్యక్షుడిగా కె.పవన్‌చంద్, కార్యదర్శిగా వి.భాస్కర్‌లు ఎన్నికైయారు. బాలికల కన్వీనర్‌గా ఎం.మమత, కో–కన్వీనర్‌గా ఎం.మల్లేశ్వరి, కమిటీ సభ్యులుగా సుబ్బు, బుజ్జి, విష్ణు, జగన్, కైలాస్, సరస్వతి, నితిషా, జ్యోతి, అమిత, శ్రావ్య, సుమిత్ర, ఇంద్రజ, నందిని ఎన్నికయ్యారు. విద్యారంగం సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పని చేస్తామని, విద్యార్థులకు అండగా ఉంటామని నూతన అధ్యక్ష, కార్యదర్శులు పవన్‌చంద్, భాస్కర్ చెప్పారు.

కూటమి ప్రభుత్వం అరాచక పాలన


సంపంగిపుట్టులో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు



గుంటసీమలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పెదబయలు: రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు ఇచ్చిన హామీలు నేరవేర్చకుండా ప్రశ్నించిన వారిని అక్రమ అరెస్టులు చేస్తూ అరాచక సాగిస్తున్నారని అరకు నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు సందడి కొండబాబు అన్నారు. మండలంలోని అడుగులపుట్టు పంచాయతీ సంపంగిపుట్టు, తొరంగుల గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని శనివారం జోరు వానలో నిర్వహించారు. కార్యక్రమంలో కొండబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఒక్క పథకం అమలుచేయలేదన్నారు. అన్నం పెట్టే రైతులకు పెట్టుబడి సహాయం లేదని, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అండగా నిలిస్తే నేడు కూటమి ప్రభుత్వ చంద్రబాబు పాలనలో రైతులు దండగా అనే విధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు చేస్తున్న మోసాలకు సంబంధించి క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి చూడాలన్నారు. 18 ఏళ్ల నిండిని ప్రతీ మహిళలకు రూ. 1500 ఇస్తామని, ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి ఇస్తామని హామీలు ఇచ్చిన బాబు మరిచారని, సూపర్ సిక్స్ అమలు చేయలేదన్నారు. కూటమీ ప్రభుత్వంలో అక్రమ కేసులు, అక్రమ అరెస్టులు, రెడ్‌బుక్ రాక్షస పాలన తప్ప ఎలాంటి అభివృద్ధి లేదన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. గ్రామ వలంటీర్లకు రూ.10 వేలు ఇస్తామని ఎన్నికల్లో ప్రకటించిన కూటమి ప్రభుత్వం నేడు వారిని పట్టించుకునే నాధుడే లేరన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మండల పార్టీ ప్రధాన కార్యదర్శి జుంబు పూర్ణయ్య, నాయకులు గోవర్ధన్, అర్జున్, బలరాం, సుబ్బారావు, నీలకంఠం, ఆనందరావు, కేశవరావు, వెంకటరావు, భగత్‌రాయ్, జగన్నాథం, పరుశురాం, సింహాద్రి, సీతారాం , జ్యోతి, ముక్తమ్మ, దేవి తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పేరుతో మోసం

దుంబ్రిగుడ: అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.పరశురామ్, వైస్ ఎంపీపీ శెట్టి ఆనంద్‌రావు ఆధ్వర్యంలో మండలంలోని గుంటసీమ పంచాయతీ కేంద్రంలో శనివారం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. జోరువానను సైతం లెక్కచేయకుండా పార్టీ శ్రేణులు, అభిమానులు, గ్రామస్తులు ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. ముందుగా గ్రామస్తుల సమస్యలను పార్టీ నాయకులు అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం 14 నెలల పాలనలో సూపర్ సిక్స్ అందాయా లేదా అని గ్రామస్తులను అడగగా ఏమీ అందలేదని ఏ పథకాలు రాక తాము అంతా చాలా ఇబ్బందుల పడుతున్నామన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పరశురామ్, వైస్ ఎంపీపీ ఆనంద్‌రావు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అనేక పథకాలు అందాయని గిరిజనులు చెబుతున్నారని, నేడు కూటమి ప్రభుత్వం పాలనలో పథకాలు లేక ప్రజలు విసుగెత్తిపోయారన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మోసం చేస్తుందన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన సాగుతోందన్నారు. చంద్రబాబు పాలనలో జరుగుతున్న మోసాలపై క్యూర్ కోడ్‌తో కూడిన పోస్టర్‌లను ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వ మోసాలను పోస్టర్‌లోని క్యూఆర్ స్కాన్ ద్వారా తెలుసుకోవాలని వాటిని ప్రదర్శించారు. గుంటసీమ సర్పంచ్ గుమ్మ నాగేశ్వరరావు, తూటంగి ఎంపీటీసీ రామరావు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు గణపతి, మండల కార్యదర్శి మతం శంకర్‌రావు, నాయకులు సింహాచలం, చిరంజీవి, తుమ్‌నాథ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో అప్రమత్తం


పాంగి పద్మారావు

ముంచంగిపుట్టు: తుపాను వల్ల కురుస్తున్న భారీ వర్షాలతో గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు అన్నారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ తుపాను ప్రభావంతో ఏకధాటిగా భారీ వర్షాలు కురుస్తున్నాయన్నారు. మండలంలో మారుమూల రంగబయలు, బుంగాపుట్టు, భూసిపుట్టు, లక్ష్మీపురం పంచాయతీల్లో అనేక గ్రామాల చుట్టూ వాగులు, గెడ్డలు ఉధృతంగా పొంగి ప్రవాహిస్తున్నాయని, దాటవద్దని ఆయన కోరారు. మత్స్యగెడ్డ పరివాహక గ్రామస్తులు నాటు పడవల ప్రయాణాలు చేయవద్దని, చేపల వేటకు దూరంగా ఉండాలని, వీలైనంత వరకు ఇళ్ల వద్దనే ఉండాలని ఆయన కోరారు. గిరిజనులకు ఎటువంటి సహాయ సహకారాలు అందించేందుకు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

క్వారీ నిర్వహణపై విచారణకు ఆదేశాలు

రంపచోడవరం: రంపచోడవరం మండలం నరసాపురంలోని మెటల్ క్వారీపై సమగ్ర విచారణ జరిపి 30 రోజుల్లో నివేదిక అందజేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్‌కు జాతీయ షెడ్యూల్ ట్రైబ్స్ కమిషన్ నోటీసు జారీ చేసిందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను చెప్పారు. ఈ మేరకు ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. మెటల్ క్వారీ వ్యవహారంపై ఇప్పటికే పలు దఫాలు స్థానిక అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. చర్యలు తీసుకోకపోవడంతో జాతీయ ఎస్టీ కమీషన్‌ను ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు. అధికారుల నిర్లక్ష్యమే ఆదివాసీసుల పాలిట శాపంగా మారుతుందన్నారు. అధికారుల నిర్లక్ష్యంపై దశల వారి ఆందోళన చేస్తామన్నారు.

ఉపాధ్యాయుల నియామకం

జి.మాడుగుల: మండలంలో ఉపాధ్యాయులు లేని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని ఉపాధ్యాయులను సర్దుబాటు చేసినట్లు ఏటీడబ్ల్యూవో నాగశిరీష తెలిపారు. మండలంలో కిల్లంకోట పంచాయతీలో కప్పలు, బందవీధి జీపీఎస్ పాఠశాలలకు బొయితిలి నుంచి డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయులను నియమించినట్టు ఆమె తెలిపారు. చింతగొప్పు, రెయ్యలగెడ్డ పాఠశాలలకు కువి భాష వలంటీర్లను నియమించినట్టు ఆమె తెలిపారు.